నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, గురువారం 16 మే 2024 | NAGARKURNOOL

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, గువ్వల బాలరాజు

న్యాయం కోసం

ఎంత వరకైనా వెళ్తాం

- దాడికి పాల్పడిన దుండగులను శిక్షించే వరకు నిద్రపోం..
- పోలీసులు ఎవరి ఆదేశానుసారం పనిచేస్తున్నారు?
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- తాటాకు చప్పుళ్లకు భయపడం..
- దాడికి ప్రతి దాడి.. మా సంస్కృతి కాదు
- పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు

అచ్చంపేట టౌన్, మే 15 : 'ఏ వ్యవస్థ అయితే నా విశాల కుటుంబం అని అనుకున్నానో.. ఆ వ్యవస్థే నేడు ప్రేక్షక పాత్ర వహించడం నా హృదయాన్ని కలచివేసింది' అని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించి రాష్ట్రపతి చేతుల మీదుగా అత్యున్నత శౌర్య పథకాన్ని అందుకున్నట్లు ఆయన గుర్తు చేశారు. బుధవారం ఆర్ఎస్పీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజుతో కలిసి విలేకరులతో సమావేశమై మాట్లాడారు. తమ పార్టీ నేతలపై దాడి జరగడం బాధాకరమన్నారు. పార్టీల కతీతంగా విధులు నిర్వర్తించాల్సిన పోలీసు వ్యవస్థ.. తమ ముందే దుండగులు సెంట్రింగ్ కర్రలతో దాడి చేసినా ఇప్పటివరకు వారిని అదుపులోకి తీసుకోకపోవడం శోచనీయమన్నారు. బాధితుడు బెడ్రూంలోకి ఉండి అరగంట వరకు పోలీసులకు సమాచారమిచ్చాడన్నారు. దాదాపు 15-20 మంది దాడి చేయడాన్ని పోలీసులు ప్రత్యక్షంగా చూసి కూడా వారిని పట్టుకోకుండా.. ఇప్పుడు పరారీలో ఉన్నారని చెప్పడం ఎన్నో అనుమానాలకు తావిస్తుందన్నారు. సాయినగర్‌లోని పోలింగ్ బూత్ వద్ద గొడవ జరిగిన సంగతి తెలిసిన వెంటనే ఆ ప్రాంతాల్లో మళ్లీ గొడవ జరుగకుండా చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు అలాంటి చర్యలేవీ తీసుకోలేదన్నారు. దాడికి పాల్పడిన వారిని శిక్షించేందుకు ఎంత వరకైనా వెళ్తామని.. డీఎస్పీ, ఎస్పీ, హ్యూమన్ రైట్స్‌ను సైతం ఆశ్రయించి వారిని శిక్షించే వరకు నిద్రపోమని స్పష్టం చేశారు. పోలీసులు.. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం పనిచేస్తున్నారా? లేక రేవంత్‌రెడ్డి.. స్థానిక ఎమ్మెల్యే ఆదేశానుసారం పని చేస్తున్నారా? అని ప్రశ్నించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వంగూర్‌లో మైనర్లు ఓట్లు వేస్తున్నారని స్థానిక బీఆర్ఎస్ నాయకుడు కోట్ల నరేందర్‌రావు బూత్ లెవల్ అధికారికి ఫిర్యాదు చేస్తే.. రంగారావు, సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముడు చింతలరెడ్డి ఆదేశాల మేరకు కంప్లెంట్ ఇస్తావా అని నరేందర్‌రావు తమ్ముడు ప్రశాంత్‌రావుపై దాడి చేశారన్నారు. అయితే దాడి చేసిన వారిని వదిలేసి బాధితుడిపై కేసు నమోదు చేయడం అమానుషమన్నారు. రూలింగ్ పార్టీ ఇచ్చిన కంప్లెంట్‌ను తీసుకొని ప్రతిపక్షం వాళ్ల ఫిర్యాదును వదిలివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తెలంగాణలోని నాలుగు కోట్ల ప్రజల రక్షణ హోం శాఖ మంత్రి హోదా లో ఉన్న రేవంత్‌రెడ్డి చేతుల్లోనే ఉంది.. మీ సొంత నియోజకవర్గంలో ప్రతిపక్షం వారిపై సెంట్రింగ్ కర్రలతో దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోలేదు.. అలాంటిది రాష్ట్ర ప్రజలను ఎలా కాపాడుకుంటారు' అని ప్రశ్నించారు. గువ్వల బాలరాజు, మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహాగౌడ్ ప్రాణాలకు సైతం ప్రమాదమున్నదని, ఏమైనా జరిగితే రేవంతే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

గువ్వల బాలరాజు మాట్లాడుతూ 'ప్రతిదాడి తమ సంస్కృతి కాదు.. ఇంత జరిగినా పోలీసులు చోద్యం చూస్తున్నారు.. అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారు' అని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు గూండాల్లా బీఆర్ఎస్ కౌన్సిలర్ సుంకరి నిర్మలాబాలరాజు ఇంటిపై దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. 15 ఏండ్లుగా ఓడిపోయి నేడు ఎమ్మెల్యే అయిన వంశీకృష్ణ అక్రమ సంపాదనకు మరిగారని.. మూర్ఖపు నైజం కలిగిన తన టీంను ప్రోత్సహిస్తూ దాడులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. అక్రమ మైనింగ్‌కు ఆటంకం లేకుండా ప్రశ్నించే గొంతుకలు ఉండకూడదని అణచివేత ధోరణిని అవలంబిస్తున్నారని విమర్శించారు. పోలీసులు వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదని.. చట్టం దుర్మార్గులకు చుట్టంగా మారిందని.. ప్రజలంతా దీనిపైనే చర్చించుకుంటున్నారన్నారు. అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ.. వారి ఆదేశానుసారం పని చేయడం సరైంది కాదన్నారు. పోలీసుల సమక్షంలో బీఆర్ఎస్ నేతలపై దాడులు జరిగినా.. ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయకపోవడం బాధాకరమని.. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ఇసుకను హైదరాబాద్‌కు అక్రమంగా రవాణా చేస్తూ 18, 20 టైర్ల వాహనాల్లో ఓవర్ లోడ్‌తో తీసుకెళ్తూ తమ ప్రభుత్వం వేసిన రోడ్లను నాశనం చేస్తున్నారని దుయ్యబట్టారు. అక్రమ సంపాదనకు మరిగి, ఇసుకను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ హయాంలో యురేనియం తవ్వకాలకు అనుమతులిచ్చారని.. ఉద్యమ సమయంలో వారు తీసుకొచ్చిన వాహనాలను వెనక్కి పంపించామని గుర్తు చేశారు. తాము చట్టసభల్లో తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని వివరించారు. ఇప్పుడు మళ్లీ మైనింగ్ మాఫియాను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఇలాంటి దాడులకు పూనుకోవడం సరికాదన్నారు. దొంగ ముఠా సంస్థలను పెంచి పోషించడానికి వ్యాపారులపై ఒత్తిడి పెంచి వసూళ్లకు పాల్పడుతున్న సంఘ విద్రోహ శక్తులను స్థానిక ఎమ్మెల్యే వెనుకేసుకు రావడం మంచిది కాదన్నారు. జైల్లో ఉన్నవారిని బయటికి తీసుకొచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.. మీ తాటాకు చప్పుళ్లకు భయపడం.. ప్రాణ త్యాగానికైనా సిద్ధపడ్డాం.. ప్రజల జీవితాలతో చెలగాటమాడితే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహాగౌడ్, కౌన్సిలర్లు సుంకరి నిర్మలాబాలరాజు, శంకర్, మన్నూపటేల్, రమేశ్‌రావు, కుతుబుద్దీన్, జెడ్పీటీసీ రాంబాబు, బీఆర్ఎస్ నాయకుడు అమీనుద్దీన్ తదితరులు ఉన్నారు.

అండగా ఉంటాం.. భయపడొద్దు..

అచ్చంపేట, మే 15 : కాంగ్రెస్ వర్గీయుల చేతిలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ కార్యకర్త సుంకరి మహేశ్‌ను బుధవారం గువ్వల బాలరాజు, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఘటన వివరాలను కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. మహేశ్‌కు మెరుగైన సేవలందించాలని వైద్యులకు సూచించారు. తమను కాంగ్రెస్ వర్గీయులు చంపడానికి కుట్ర పన్నారని.. వారి నుంచి ప్రాణహాని ఉందని బాధిత కుటుంబసభ్యులు వివరించారు. ఈ సందర్భంగా గువ్వల మాట్లాడుతూ కుటుంబానికి అండగా ఉంటామని, భయపడాల్సిన అవసరం లేదన్నారు. దాడికి పాల్పడిన వారిని శిక్షించే వరకు వదిలిపెట్టమని వారికి భరోసానిచ్చారు.

సుంకరి మహేశ్‌ను పరామర్శిస్తున్న ఆర్ఎస్పీ, గువ్వల బాలరాజు

కాలి బూడిదైన ఆయిల్‌పాం తోట

అగ్నికి ఆహుతైన ఆయిల్ పాం తోట

- రూ.4లక్షల ఆస్తి నష్టం

కొత్తకోట, మే15 : ప్రమాదవశాత్తు ఆయిల్ పాం తోట దగ్ధమైన ఘటన మండలంలోని పాలెం గ్రామంలో చోటుచేసుకున్నది. వివరాలిలా.. గ్రామానికి చెందిన రైతు కురుమయ్య మూడెకరాల్లో ఆయిల్ పాం తోటను సాగు చేస్తున్నాడు. కాగా బుధవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు తోటకు నిప్పంటుకొగా డ్రిప్ పైపులతోపాటు మొక్కలు పూర్తిగా దగ్ధమయ్యాయి. గమనించిన స్థానికులు సమాచారమివ్వగా ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పినా.. అప్పటికే నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయాడు. పక్కనే సబ్‌స్టేషన్ ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా సుమారు రూ.4లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.

చెంచు కాలనీకి కరెంటొచ్చింది..

- స్పందించిన విద్యుత్ అధికారులు
- స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కొల్లాపూర్ రూరల్, మే 15 : కొల్లాపూర్ మండలం అమరగిరి చెంచుగూడెం ప్రజలకు కరెంట్ కష్టాలు తీరనున్నాయి. 'విద్యుత్ ఇవ్వాలని రెండుగంటల పాటు ఎన్నికలు బహిష్కరించిన చెంచులు' అనే కథనం నమస్తే తెలంగాణ దినపత్రికలో మంగళవారం ప్రచురితమైనది. దీంతో బుధవారం సంబంధిత అధికారులు కరెంట్ తీగలతోపాటు ఒక స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. అభివృద్ధికి దూరంగా ఉన్న చెంచుగూడెంలో మౌలిక వసతులు కల్పించాలని మాజీ ఉపసర్పంచ్ మల్లేశ్ ప్రభుత్వాన్ని కోరారు.

నమస్తే ఎఫెక్ట్

చేతులెత్తేశారు..!

- సొంత జిల్లాలో సీఎంకు ఓటమి భయం
- రెండు పార్లమెంట్ స్థానాల్లోనూ నిరాశే..
- క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన పార్టీ నేతలు
- ఎమ్మెల్యేలు సైతం నామమాత్రపు ప్రచారం
- తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకున్న సర్కారు
- బీఆర్ఎస్ పార్టీకి కలిసివచ్చిన అవకాశం
- మెజార్టీపై బీజేపీ లెక్కలు
- ఓటరు నాడి ఎటువైపో..!

సీఎం ఆదేశాలు బేఖాతరు..

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి జిల్లాకు చెందిన రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా నియమించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ అనూహ్య విజయాన్ని సాధించడం.. ఇదే జిల్లాకు చెందిన రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో ఆ పార్టీ నేతల్లో ఆశలు చిగురించాయి. అధికారంలోకి చేపట్టిన వెంటనే వచ్చిన పార్లమెంట్ ఎన్నికలను ఆ పార్టీకి పరీక్షగా మారాయి. దీంతో రేవంత్‌రెడ్డి ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో ఎనిమిదిసార్లు ప్రచారంలో పాల్గొన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ లోనూ అభ్యర్థికి మద్దతుగా రాహుల్ గాంధీ, సీఎం ప్రచారం చేపట్టారు. ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాలను గెలుచుకున్న ఆ పార్టీకి ఈ ఎన్నికలు సవాల్‌గా మారాయి. సీఎం సొంత జిల్లా కావడంతో నేతలంతా చాలెంజింగ్‌గా తీసుకున్నారు. కానీ అసెంబ్లీ ఎన్నికల సీన్ మాత్రం రిపీట్ కాలేదని ఆ పార్టీ నేతలే అంటున్నారు.



'హ్యాండ్' ఇచ్చిన నేతలు..

పాలమూరు పార్లమెంట్ అభ్యర్థిగా వంశీచంద్‌రెడ్డిని, నాగర్‌కర్నూల్ స్థానాన్ని మాజీ ఎంపీ మల్లు రవికి కేటాయించారు. ఈ రెండు స్థానాల్లో చాలామంది కాంగ్రెస్ నేతలు టికెట్ కావాలని పోటీపడినా కాదని వీరికి ఇచ్చారు. పాలమూరు ఎంపీ స్థానాన్ని తనకు కేటాయించాలని సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా తిరుపతిరెడ్డి యువసేన పేరుతో ఏకంగా పార్లమెంట్ పరిధిలో భారీ ఫ్లెక్సీలు సైతం వేయించారు. ఏమైందో తెలియదు కానీ.. ఆ ఫ్లెక్సీలను రెండు గంటల్లోనే అధికారులతో తీసివేయించారు. దీంతో సీఎంకు తన సోదరుడికి మధ్య వాగ్వాదం జరిగిందని ప్రచారం జరిగింది. వంశీచంద్‌రెడ్డి ఎలా గెలుస్తాడో నేను కూడా చూస్తానని తిరుపతిరెడ్డి శపథం చేసినట్లు పార్టీలో చర్చ జరుగుతున్నది. కందనూలు ఎంపీ స్థానాన్ని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ పొందాలని తీవ్ర ప్రయత్నాలు చేశారు. తనకు టికెట్ రాకుండా మంత్రి జూపల్లి గేమ్ ఆడుతున్నాడంటూ మీడియా ముందు వాపోయాడు. కాంగ్రెస్‌లో మాదిగలను అణచివేస్తున్నారని గాంధీ భవన్ సాక్షిగా ప్రకటించారు. ఇంత జరుగుతున్నా వంశీచంద్‌రెడ్డి, మల్లు రవికి టికెట్లు కేటాయించారు. ఈక్రమంలో రెండు స్థానాలను గెలిచి తీరాలని సీఎం ఆదేశించినప్పటికీ స్థానిక కాంగ్రెస్ నేతలు చేతులెత్తేయడంతో అధికార పార్టీకి ఓటమి భయం పట్టుకున్నది.

దూరం దూరంగా ఎమ్మెల్యేలు..

ఇటు పాలమూరు, అటు కందనూలు ఎంపీ అభ్యర్థులిద్దరూ ఎమ్మెల్యేలను బేఖాతరు చేయడంతో ఆ పార్టీ ఓటమిని కొనితెచ్చుకున్నట్లయ్యింది. అభ్యర్థులు తమను కాదని సొంత ఎజెండాతో ప్రచారానికి దిగడంతో ఎమ్మెల్యేలు చేతులెత్తేశారు. మంత్రి జూపల్లి కూడా నామమాత్రంగానే ప్రచారం చేశారు. సొంత జిల్లాలో గెలిచి తీరాలని సీఎం హెలికాప్టర్‌లో చక్కర్లు కొట్టినా.. ఎమ్మెల్యేలు మాత్రం అభ్యర్థులతో కలిసి నామమాత్రంగా ప్రచారంలో పాల్గొన్నారు. కిందిస్థాయి నేతలను పట్టించుకోకపోవడంతో క్రాస్ ఓటింగ్‌కు అవకాశం ఏర్పడింది. ఎమ్మెల్యేల తీరుపై వంశీచంద్‌రెడ్డి ఏకంగా నేతలకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

కేసీఆర్ రోడ్‌షోతో జోష్..

అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఐదు నెలలైనా గ్యారెంటీలను అమలు చేయకపోవడంతో ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైంది. ఇది పార్లమెంట్ ఎన్నికలపై స్పష్టంగా పడిందని చెప్పవచ్చు. కాగా కేసీఆర్ ఉమ్మడి జిల్లాలో చేపట్టిన రోడ్ షో పార్టీ క్యాడర్లో జోష్‌ను నింపింది. ఈక్రమంలో కాంగ్రెస్ కన్నా బీఆర్ఎస్సే మేలు అనే భావన ప్రజల్లో వచ్చింది. దీంతో ఓటర్లు గులాబీ పంచ న చేరడంతో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లన్నీ బీఆర్ఎస్‌కు కలిసొచ్చాయి.

అప్పుడే ఎంపీ అయినట్టు..

ఎంపీ ఎన్నికలు ముగిశాయో లేదో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ రెండులక్షల మెజార్టీతో గెలుస్తానని ప్రకటించడంపై విమర్శలొస్తున్నాయి. డీకే అరుణ అప్పుడే ఎంపీ అయిపోయినట్లు భ్రమ పడుతున్నారని ఆయా పక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఎంపీ ఎన్నికల్లో ఓటర్లు క్రాస్ ఓటింగ్‌కి పాల్పడినట్లు స్పష్టంగా తేలుతున్నా.. బీజేపీ నేతలు మాత్రం మేమే గెలిచామని సంబురపడిపోవడాన్ని చూసి.. ఆలు లేదు.. సూలు లేదు.. కొడుకు పేరు సోమలింగం' అన్నట్టు ఉందని సెటైర్లు వేస్తున్నారు. మొత్తంగా క్రాస్ ఓటింగ్ భయం ఆయా పార్టీలను వెంటాడుతోంది. విజయం ఎవరిని వరిస్తుందనేది ఫలితాల రాకతో స్పష్టం కానున్నది.

అలంపూర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

మూణ్నెళ్లుగా పే స్లిప్పులివ్వట్లేదు..

- కనిపించని మౌలిక సదుపాయాలు
- పట్టించుకోని అధికారులు
- ధర్నా చేపట్టిన ఉపాధి కూలీలు

అలంపూర్, మే 15 : ఉండవల్లి మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు మూడు నెలలుగా పే స్లిప్పులు ఇవ్వడం లేదని బుధవారం వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎండాకాలంలో నిబంధనల మేరకు ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో నీడ, మంచినీళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ వంటి ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదని కూలీలు ఆరోపించారు. పనులను పర్యవేక్షించాల్సిన మండలస్థాయి అధికారులు సైతం పట్టీపట్టనట్లు వ్యవహరించారని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి దేవదాసు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆంజనేయులు ధ్వజమెత్తారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా మూడు నెలలుగా కూలీలకు పే స్లిప్పులివ్వడంలో జాప్యం జరిగిందన్నారు. వంద రోజుల వేతనాలు ఇవ్వకపోతే కూలీల కుటుంబాలు ఏవిధంగా బతుకుతాయని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా రోజుకు రూ..300 చెల్లించాలని.. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కూలి రేటును రూ.600 వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి వంద రోజుల పని దినాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నదన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల తీరు మార్చుకోవాలి

- విధులు సక్రమంగా నిర్వర్తించాలి
- దవాఖాన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

రోగులతో వైద్య సేవలపై ఆరా తీస్తున్న కమిషనర్ అజయ్‌కుమార్

గద్వాల అర్బన్, మే 15 : ప్రభుత్వ దవాఖానల్లో విధులు నిర్వర్తించే వైద్యులు, సిబ్బంది తీరు మార్చుకోవాలి.. రోగులపై శ్రద్ధ వహించాలి.. అని తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను ఆయన బుధవారం తనిఖీ చేసి రోగులకు అందుతున్న సేవలు, చికిత్సలు, వసతులపై ఆరా తీశారు. వార్డుల పరిశీలన అనంతరం వైద్యులు, సిబ్బందికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సీనియర్ వైద్యులు విధులకు సక్రమంగా హాజరుకావడం లేదంటూ ఫిర్యాదులు వస్తున్నాయని.. దవాఖానలో సరైన నిర్వహణ లేదని రోగులు చెబుతున్నారన్నారు. ఈ విషయంపై వైద్యులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దవాఖాన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోగులపై శ్రద్ధ చూపాలని సూచించారు. ఇటీవల బోయలగూడెం గ్రామానికి చెందిన గర్భిణి ప్రసవానికి రాగా పురిట్లోనే శిశువు మృతి చెందిందని తెలుసుకున్న కమిషనర్ వైద్యుల పని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దవాఖానకు వచ్చే ప్రతి రోగికి బాధ్యతగా చికిత్స చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ అర్బన్, మే 15 : గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎస్టీ అభ్యర్థుల నుంచి నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ స్కీం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మహబూబ్‌నగర్, నారాయణపేట గిరిజన అభివృద్ధి శాఖ అధికారి ఎం చత్రునాయక్ బుధవారం ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరం స్కాలర్‌షిప్ పొందాలనుకునే విద్యార్థులు ఈ పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. మాస్టర్స్, పీహెచ్‌డీ, రీసెర్చ్ ప్రోగ్రాం కోసం విదేశాలల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకొనే వారికి కేంద్ర ప్రభుత్వం (NOS) స్కాలర్‌షిప్ అందిస్తుంది. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోపు overseas.tribal.gov.inలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

నేటి నుంచి సెమిస్టర్ పరీక్షలు

పాలమూరు, మే15 : పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ 2, 4, 5, 6వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు గురువారం నుంచి నిర్వహించనున్నట్లు పీయూ పరీక్షల నియంత్రణ అధికారి డా.రాజ్‌కుమార్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. 49 కేంద్రాల్లో 2వ సెమిస్టర్‌లో 20,575 మంది, 4వ సెమిస్టర్‌లో 16,902 మంది, 5వ సెమిస్టర్‌లో 2,216మంది, 6వ సెమిస్టర్‌లో 13,751 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన చీఫ్ సూపరింటెండెంట్, సిట్టింగ్‌స్క్వాడ్‌లు, ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించామన్నారు. టైమ్‌టేబుల్, వివరాలకు www.palamuruuniversity.com వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

సోనా మసూరి @ రూ.2,472

నారాయణపేట టౌన్, మే 15 : నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం 3,466 క్వింటాళ్ల సోనా మసూరి విక్రయానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.2,472, కనిష్ఠంగా రూ. 1,301 పలికింది. 5 క్వింటాళ్ల హంసరకం ధాన్యం విక్రయానికి రాగా క్వింటాకు రూ.1,871 ధర పలికింది. 20 క్వింటాళ్ల జొన్నలు విక్రయానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.4,455 కనిష్ఠంగా రూ. 3,725 ధర పలికాయి. 13క్వింటాళ్ల పెసళ్లు విక్రయానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.7,639 కనిష్ఠంగా రూ.7,050 ధర పలికినట్లు యార్డు సూపర్‌వైజర్ లక్ష్మణ్ తెలిపారు.